VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 139
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
మంగళవారం 27 అక్టోబర్ 2026

# తుఫానుతో రేపు ఎల్లుండి భారీ వర్షాలకు ఆస్కారం

**● ఆస్తి, ప్రాణనష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు ● వరద ముంపు ప్రాంతాల్లో షెల్టర్లకు బాధితుల తరలింపు ● తుఫాను గమనం అంచనా వేస్తూ ప్రతి 4 గంటలకూ హెచ్చరికలు జారీ ● అర్నబ్ తుఫాన్ పరిస్థితిపై గంట గంటకూ సమీక్షిస్తోన్న సీఎం చంద్రబాబు**

**అమరావతి,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో సీఎం వర్చువల్‌గా సమీక్షించారు. రేపటి కల్లా తీవ్ర తుఫానుగా మారి ఇది రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికల రీత్యా ఆయా తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నెల 28వ తేదీన ఆర్నబ్ తీవ్ర తుఫాను బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను కారణంగా రేపు మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకూ వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు. అలాగే తీరప్రాంతాల వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని సీఎంకు తెలియచేశారు. తుఫాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 28,29 తేదీల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. అర్నబ్ తుఫాన్ విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



**షెల్టర్లకు లోతట్టు ప్రాంతాల ప్రజలు..** తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాను షెల్టర్లకు తరలించాలని సీఎం నిర్ద?శించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్ 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సీఎం సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాన్నారు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళంతోపాటు కోస్టుగార్డుల సేవలను ఈ తుఫాన్ సహాయక చర్యల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం నిర్దేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా తీరప్రాంతానికి తిరిగి రప్పించామని అధికారులు వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షితంగా హార్బర్‌లకు చేరుకున్నాయని తెలిపారు. తుఫాను బలహీన పడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు.

**పంటనష్టం వాటిల్లకుండా చర్యలు..** కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖను ముఖ్యమంత్రి నిర్దేశించారు. దాదాపు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు ముప్పు పొంచివున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లోనూ సరకులు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చిన చోట తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు తుపాను గమనాన్ని అంచనా వేస్తూ ప్రతీ నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికతో కూడిన బులెటిన్ జారీ చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంలో వచ్చిన తుఫాన్ల సమాచారాన్ని విశ్లేషిస్తూ రైతులకు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించాలని సూచించారు. అలాగే ఆర్నబ్ తుఫాను కారణంగా వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొత్తం 22 రిజర్వాయర్ల పరిధిలో వరద ప్రవాహాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రవాహాలతో 10-12 టీఎంసీల మేర నీటిని నిల్వ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తాండవ, రైవాడ, యేలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, తాడిపూడి రిజర్వాయర్లకు పూర్తి స్థాయిలో నీటి నిల్వలు వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. వాగులు, వంకలు, కాలువల ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తుఫాను ప్రభావంపై దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలని సీఎం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇక తుఫాన్ ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో చూసి... ఆ మేరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని సీఎం సూచించారు. ప్రతి తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి గంట గంటకూ అధికారుల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ సహా వివిధ శాఖల అధికారులు, మంత్రి రామానాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు.

# శ్రీవారిని దర్శించుకున్న భారత ఉపరాష్ట్రపతి



**తిరుమల ,కలంకౌంటర్ :** భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ,టిటిడి బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు

**● టీడీపీలో చేరిన కొలనుకొండ సీపీఎం సీనియర్ నేత కాట్రగడ్డ శివన్నారాయణ ● ఆత్మకూరుకు చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నేత ముసలి జ్యోతిబసు ● పేరుకలపూడికి చెందిన వైసీపీ సీనియర్ నేత నూతలపాటి చెన్నకేశవరావు ● ఈమని గ్రామానికి చెందిన వైసీపీ నేత ఉయ్యూరు వెంకటేశ్వరరావు ● ఈమనికి చెందిన వైసీపీ నేత ముద్రబోయిన శ్రీను ● చిలువూరుకు చెందిన వైసీపీ నేత షేక్ యూసబ్ ● వీరితో పాటు సుమారు 200 కుటుంబాలు టీడీపీలో చేరిక ● అందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్**



**అమరావతి,కలంకౌంటర్ :** మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ మాజీ సభ్యుడు, కాట్రగడ్డ శివన్నారాయణతో పాటు ఆ పార్టీకి చెందిన 100 కుటుంబాలు, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ ముసలి జ్యోతిబసుతో పాటు 40 కుటుంబాలు మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరాయి. దుగ్గిరాల మండలం పేరుకలపూడికి చెందిన వైసీపీ సీనియర్ నేత నూతలపాటి చెన్నకేశవరావుతో పాటు 10 కుటుంబాలు, దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన వైసీపీ నేత ఉయ్యూరు వెంకటేశ్వరరావుతో పాటు వైసీపీకి చెందిన 15 కుటుంబాలు, ఈమనికి చెందిన వైసీపీ నేత ముద్రబోయిన శ్రీనుతో పాటు 15 కుటుంబాలు, దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత షేక్ యూసబ్ తో పాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఉండవల్లి నివాసంలో వీరందరికీ టీడీపీ కండువాలు కప్పి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**అత్యధిక మెజార్టీతో గెలిపించారు..** ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. నేనేంటో మీకు అర్థం కాలేదు. మీ సమస్యలేంటో నాకు తెలియవు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు ప్రజల్లో ఉండి వారి సమస్యలు అర్థం చేసుకున్నా. మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ పరంగా చేపట్టాం. అంతకుముందు 15 ఏళ్లు మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన వారు చేసిన అభివృద్ధిని, నేను చేపట్టిన కార్యక్రమాలను బేరీజు వేసుకుని 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశా. ఎంత ఎక్కువ

# కూటమిని గెలిపించండి - రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర










**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా తో పాటు డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర బార్ అసోసియేషన్ సభ్యులకు విజ్ఞప్తి చేసారు. సోమవారం కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా, హసీమ్ బేగ్ లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమాన్ని వివరించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమ స్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# అబ్దుల్ అబీదాకు కాపునాడు మద్దతు

**● మేయర్ గా అబీదాను గెలిపించుకుంటాం ● కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపులో భాగస్వాములవుతాం ● కాపునాడు మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు వడ్లమూడి చిన్న**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం మేయర్ స్థానానికి పోటీ చేస్తున్న కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థి అబ్దుల్ అబీదాకు కాపునాడు మద్దతు తెలిపింది. నగర మేయర్ గా అబ్దుల్ అబీదాను, కార్పొరేటర్లుగా పోటీ చేస్తున్న 60 డివిజన్ల కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని కాపునాడు మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు వడ్లమూడి వీరాంజనేయులు (చిన్న) తెలిపారు. చిన్న అధ్యక్షతన సోమవారం కాపునాడు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదాను స్వాగతించి తమ మద్దతు తెలియజేశారు. నవంబర్ 1న జరిగే నగర పాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కాపునాడు సంఘీయులకు పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా కూటమి అభ్యర్థులను బలపర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మచిలీపట్నం స్థితిగతులు మారాయన్నారు. అధ్వాన్నంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ ఇతోధికంగా కృషి చేస్తున్నారన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ టీడీపీ అభ్యర్థి హసీం బేగ్, కాపునాడు ప్రతినిధులు నరహరశెట్టి హరికృష్ణ, కూనపరెడ్డి బ్రహ్మయ్య, కూనపరెడ్డి శ్రీనివాసరావు, పంచకర్ల మూర్తి, రాయగిరి శ్రీరామ్, నిడదవోలు శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వరరావు, ముదినేని కొండా, కొత్తపల్లి వేణు మాధవ్, ఐ. రామారావు, కూనపురెడ్డి సుబ్బారావు, పొన్నూరి శ్రీనివాస్, వేమూరి మురళి తదితరులు పాల్గున్నారు.

## మార్కాపురంలో జిల్లా ప్రజాప్రతినిధుల కీలక భేటీ...

● జిల్లా పరిషత్ ఎన్నికలలో సీట్ల సర్దుబాట్లపై చర్చ.....



**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కపురంలో స్థానిక మార్కెట్ యార్డులో జిల్లా ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు అధ్యక్షతన జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశం జరిగింది.. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి , మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక తదితర కీలక అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

## కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు..



**మార్కాపురం,కలంకౌంటర్ :** మహర్షి వాల్మీకి మానవతా విలువలు, సన్మార్గాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కలెక్టర్ ఎం. విజయ సునీత వెల్లడి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ విజయసునీత ఘనంగా నివాళులర్పించారు. రామాయణ మహాకావ్యం మానవ జీవితానికి, ధర్మానికి, నిలువెత్తు నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. ధర్మం, సత్యం, సదాచారం, భక్తి, జ్ఞానం వంటి వాల్మీకి మహర్షి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సమరసత, సమగ్రత సాధనకు మహర్షుల బోధనలు ఎంతో ఉపయోగకరమని వెల్లడించారు. జిల్లా ప్రజలందరికీ మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకికి నివాళులర్పించారు......

## కాపులను బీసీల్లో చేర్చేందుకు కృషి చేయాలి..

బిజెపి ఎంఎల్సి సోము వీర్రాజు కు కాపు సంఘం నాయకుల వినతి....



**మార్కాపురం,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని కాపులను బీసీల్లో చేర్చేందుకు కృషి చేయాలని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజును గిద్దలూరు శ్రీ కృష్ణ దేవరాయ కాపు బలిజ సంఘం నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు సోమవారం గిద్దలూరు పట్టణంలో సోము వీర్రాజు ను కలిసి కాపు, బలిజ కులస్తులు సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్ళి కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన సోము వీర్రాజు కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ ల అమలు బాధ్యత రాష్ట్రాలకు ఇచ్చి వేసిందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సోము వీర్రాజు ను మర్యాద పూర్వకంగా కలిశిన నాయకులు గిద్దలూరు ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో ఛైర్మన్ అభ్యర్థి జెవి నారాయణను గెలిపించాలని ఆయన బలిజ సంఘం నాయకులను కోరారు....

## ఛైర్మన్ అభ్యర్థి కనకదుర్గకు మద్దతుగా అన్నా కృష్ణ చైతన్య

వైఎస్సార్ సీపీ గెలుపు పై పెరిగిన ధీమా.



ఓటర్లకు దండం పెట్టి ఓటు అడుగుతున్న కృష్ణ చైతన్య.



**మార్కాపురం,కలంకౌంటర్ :** మున్సిపల్ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి కనకదుర్గ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ శాసనసభ్యులు మార్కాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి అన్నా రాంబాబు తనయుడు అన్న కృష్ణ చైతన్య రంగంలోకి దిగారు. యువతులో గట్టి పట్టు ఉన్న అన్నా కృష్ణ చైతన్య రంగంలోకి దిగడంతో యువతులో ఉత్సాహం రెట్టింపు అయింది. ఎన్నికల ప్రచారంలో ఆత్మీయ పిలుపుతో అన్న, అక్కా,చెల్లీ, తల్లీ అంటూ పిలుస్తూ ఛైర్మన్ అభ్యర్థి కనకదుర్గకు ఫ్యాన్ గుర్తు పై ఓటెయ్యాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో అన్నా కృష్ణ చైతన్యకు ప్రజలు పూలదండలు శాలువాలు వేసి స్వాగతిస్తున్నారు. దీంతో వైఎస్ఆర్సిపి శ్రేణులు గెలుపు పై బీమా వ్యక్తం అవుతుంది.

# ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న అభ్యర్థులపై చర్యలేవి?

● వందల సంఖ్యలో స్థానికేతరులు తిష్టవేసిన వైనం. ● ప్రశాంత ఓటింగ్ పై ఓటర్లలో అభద్రత



చర్చిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, నాయకులు సిఎస్ఐ చర్చిలో 10వ వార్డు అభ్యర్థి బి. సాయి ప్రభంద



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి తులాభారం మహోత్సవంలో బిజెపి అభ్యర్థి జెవి నారాయణ



తులాభారం మహోత్సవానికి హాజరయిన మహిళలు...



సిఎస్ఐ చర్చిలో ఓటర్లను ప్రభావితం చేస్తున్న వైఎస్ఆర్ సీపీ ఛైర్మన్ అభ్యర్థి భూమా బాల నరసింహారెడ్డి



శ్రీ వాసవీ మాత తులాభారం మహోత్సవంలో ఓటర్లను ప్రభావితం చేస్తున్న బిజెపి నాయకులు



**గిద్దలూరు,కలంకౌంటర్ :** మునిసిపల్ ఎన్నికలలో ప్రచార పర్వం మొదలైన తరువాత అభ్యర్థులు ఏకపక్షంగా తమ ఇష్టారీతిన ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి భూమా నర్సింహారెడ్డి, 10 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బి.సాయి ప్రభంద సిఎస్ఐ చర్చి వార్షికోత్సవ వేడుకలు జరుగుతుండగా వెళ్ళి ప్రచారం నిర్వహించారు. చర్చిలో ప్రార్థనల పేరుతో వెళ్ళిన నాయకులు చర్చిలోని ప్రజలకు నమస్కారాలు పెడుతూ ఓట్లు అభ్యర్థించారు. మరోవైపు గిద్దలూరు బిజెపి ఛైర్మన్ అభ్యర్థి జెవి నారాయణ, బిజెపి ఎంఎల్సీ సోము వీర్రాజుతో కలిసి పట్టణంలోని శ్రీ కుసుమ హరనాథ మందిరం ఆవరణలో ఆర్యవైశ్య సమారాధన, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి తులాభారం మహొత్సవం జరుగుతుండగా అక్కడకు వెళ్ళి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు బిజెపి



నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనల ప్రకారం చర్చిలు, దేవాలయాలు, మసీదుల వద్దకు వెళ్ళి ఓటర్లను ప్రభావితం చేయరాదు. నామినేషన్ లు పూర్తయిన అనంతరం ఛైర్మన్ అభ్యర్థుల వెంట వీడియో గ్రాఫర్ తో రికార్డు చేయాల్సి ఉంది. ఎన్నికల అధికారులు, సిబ్బంది కోడ్ ఆఫ్ కండక్ట్ అమలును గాలికి వదిలేయడం పట్ల ఓటర్ల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గిద్దలూరు పట్టణంలో వందల సంఖ్యలో స్థానికేతరులు ఎన్నికల ప్రచారం పేరుతో తిష్ఠ వేసి ప్రజలలో అభద్రతా భావం నెలకొంది. దీంతో ప్రశాంత పోలింగ్ పై ప్రజలలో విశ్వాసం సన్నగిల్లింది. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరపున మాజీ ఎమ్మెల్యే అన్నారాంబాబు ముమ్మర ప్రచారం

–గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇన్చార్జి అన్నా





ఓటర్లను అభ్యర్థిస్తున్న ఛైర్మన్ అభ్యర్థి కనకదుర్గ...

**మార్కాపురం,కలంకౌంటర్ :** మున్సిపల్ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఛైర్మన్ అభ్యర్థి కనకదుర్గ గెలుపు ను ఇన్చార్జి అన్నా రాంబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పట్టణంలోని మైనారిటీలు, సామాజిక వర్గాల మద్దతుతో పాటు ఎన్నికలలో కీలకంగా మారిన ఆర్యవైశ్యుల మద్దతు స్వీకరించేందుకు పావులు కదుపుతున్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు మార్కాపురం లో కార్యకర్తలలో ఉత్సాహం నింపారు. సోమవారం ఎన్నికల్లో 36, 37, 38, 39, 40 వార్డుల్లో అన్నా రాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి డాక్టర్ కనకదుర్గను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారాంబాబు పిలుపు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించిన అన్నా రాంబాబు ఓటును మరీ మరీ గుర్తు చేస్తున్నారు. మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి



వైసిపి శ్రేణులలో ఉత్సాహం నింపుతున్న రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి

చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నా రాంబాబు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడి పట్టణ అభివృద్ధి కోసం ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు.

## ఊపందుకున్న వక్కలగడ్డ మల్లికార్జున్ ప్రచారం..

బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బొంతల కృష్ణతో ప్రచారం



ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం,కలంకౌంటర్:** మార్కాపురం మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున్ ప్రచారంలో పట్టు బిగిస్తున్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆశీస్సులతో రెండవ పర్యాయం మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థిగా సత్తా చాటనున్నారు . ఎన్నికల ప్రచారంలో టిడిపి హయాంలో సాధించిన మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం, నూతనంగా రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల పెంపు విషయాలను పదేపదే ప్రస్తావిస్తున్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా ఈప్రాంత యువతకు, రైతాంగానికి ఉపాధి అవకాశాలు మరింతగా పెరగనున్నాయని చెబుతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి, ప్రకాశం జిల్లా ఎన్నికల ఇన్చార్జి బిటి నాయుడు పలువురు నేతలతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. 26వ వార్డులో బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బొంతల కృష్ణ ను రంగంలోకి దించడం ద్వారా ఆర్యవైశ్య వర్గాలలో పట్టు పెంచారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలు, అభివృద్ధి నినాదం,ఎన్నికల ప్రచారం గెలుపు అవకాశాలను మరింత పెంచాయి..

## ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడిగా విశ్రాంత జడ్జి నేరెళ్ల శ్రీనివాసరావు



**కావలి,కలంకౌంటర్ :** రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జ్యుడీషియల్ సభ్యుడిగా విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి నేరెళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణానికి చెందిన , వ్యాపారవేత్త గ్రంధి యానాశెట్టి అల్లుడైన నేరెళ్ల శ్రీనివాసరావుకు ఈ కీలక బాధ్యతలు దక్కడం పట్ల పట్టణప్రజలు,బంధుమిత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సమర్థవంతమైన సేవలకు దక్కిన గుర్తింపు నేరెళ్ల శ్రీనివాసరావు గతంలో కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విశేష సేవలందించారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ప్రధాన కార్యాలయం కర్నూలులోనే ఉన్న నేపథ్యంలో, గతంలో అక్కడే జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన అనుభవం ఉన్న శ్రీనివాసరావును జ్యుడీషియల్ సభ్యుడిగా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. హెచ్ఆర్సీ సభ్యుడిగా నియమితులైన నేరెళ్ల శ్రీనివాసరావుకు కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ గూటికి 22 కుటుంబాలు

**కావలి,కలంకౌంటర్ :** నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కార్యకర్తలు చలంచర్ల పంచాయతీ పేపార్లవారిపాలెం గ్రామానికి చెందిన కీలక నేత పేపాల చంద్రమోహన్ ఆధ్వర్యంలో సుమారు 22 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నూతనంగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

## వినూత్న రీతిలో వైసీపీ ప్రచారం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 17 వ డివిజన్ లో వైసీపీ అభ్యర్థి ఉడత్తు సాయి కిరణ్ కి ఓటు వేసి గెలిపించడం కోసం మీ ఓటు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ వినూత్న రీతిలో చేస్తున్న ప్రచారం చర్చనీయంశం అయింది. ఫ్యాన్ గుర్తుకు ఓటయాలనీ ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



## గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తా..

● వైశ్యులు , వ్యాపార సంస్థలకు అండగా ఉంటా



ఎన్నికల కరపత్రం అందజేస్తున్న ముద్దర్ల శ్రీను...



సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న నాయకులు...

**గిద్దలూరు,కలంకౌంటర్:** మున్సిపల్ ఎన్నికలలో 7వ వార్డు కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తానని కూటమి పార్టీల (టిడిపి) కౌన్సిలర్ అభ్యర్థి ముద్దర్ల లక్ష్మీదేవి అంటున్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో 7వ వార్డులోని వర్తక, వ్యాపార సంస్థల సముదాయంలో ముద్దర్ల లక్ష్మీదేవి కూటమి నాయకులతో ప్రచారం నిర్వహించారు. 7వ వార్డులో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఆర్యవైశ్యులు, వ్యాపార సంస్థలకు అండగా ఉంటానని, వారికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీ లేని రుణాలు ఇప్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని అంటున్నారు. నవంబర్ 1తేదీన జరుగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో గిద్దలూరు మాజీ ఏఎంసి డైరెక్టర్ పర్చూరి నాగేశ్వరరావు, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి ముప్పూరి శ్రీనివాసులు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## కొమరోలులో దాడికి గురైన సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఆవులయ్యకు పరామర్శ



**గిద్దలూరు,కలంకౌంటర్ :** ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. మార్కాపురం జిల్లా కొమరోలు మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల సందర్భంగా దాడికి గురైన సీపీఎం మార్కాపురం జిల్లా అధ్యక్షుడు టి. ఆవులయ్యను సీపీఎం రాష్ట్రప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఎన్నికల ప్రచారంలో ముందంజలో లొక్కు రాజమ్మ

● గెలుపుపై ధీమా





**గిద్దలూరు,కలంకౌంటర్ :** మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికలలో 10 వ వార్డు నుండి పోటీ చేస్తున్న లొక్కు రాజమ్మ ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులోని పలు సామాజిక వర్గాల నాయకులు ఓటర్లను కలిసి మద్దతు సమీకరించారు. గతంలో చేసిన అభివృద్ధి పనులు చూసి ఓటు వేయాలని పదవ వార్డ్ నుండి కౌన్సిలర్ గా గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నారు. వార్డులోని ప్రతి లబ్ధిదారునికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తానని హామీ ఇస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ఓటర్లు, సామాజిక వర్గాల నేతలు ఆదరణ చూపిస్తున్నారని అన్నారు. నవంబర్ ఒకటో తేదీన జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

## 18వ వార్డులో పట్టు బిగిస్తున్న టిడిపి కౌన్సిలర్ అభ్యర్థి వేములపాటి చంటి

### చంటికి మద్దతుగా బిసి కులాల నాయకులు





ఎన్నికల ప్రచారంలో ముందంజలో వేములపాటి చంటి

**గిద్దలూరు,కలంకౌంటర్ :** మున్సిపల్ ఎన్నికలలో 18 వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేములపాటి చంటి ప్రచారంలో పట్టు బిగుస్తున్నారు. వార్డులోని ప్రతి ఓటరును కలిసి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్నారు. స్థానిక రాజకీయాలలో అనుభవం ఉన్న నాయకులతో కలిసి సామాజిక వర్గాల మద్దతుతో విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వార్డులోని స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులను ఎన్నికలలో తనను గెలిపించాలని కోరుతున్నారు . శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి ఎమ్మెల్యే ఆశీస్సులతో వార్డు లో రోడ్లు, డ్రైన్లు , మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తానని అంటున్నారు. వార్డులో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించే తమకు సైకిల్ గుర్తు పై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు.

## ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇస్తాం - ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ



**వినుకొండ,కలంకౌంటర్ :** పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద గల వాసవి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రతినిధులతో సమావేశం లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు,ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జీవీ మాట్లాడుతూ... మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుగొండ శ్రీనివాసరావుతో పాటు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని 36 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షమీంఖాన్ బరిలో ఉన్నారని తెలిపారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి చైర్మన్ అభ్యర్థి షమీంఖాన్, వైస్ చైర్మన్ పెనుగొండ శ్రీనివాసరావులతో పాటు కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. . డీసీసీబీ చైర్మన్ లిమక్కెన మల్లికార్జున రావు,నాయకులు, కూటమి తదితరులు పాల్గొన్నారు

## పోతురాజు కాలువను అభివృద్ధి చేస్తా

-వైసీపీ మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్







**ఒంగోలు,కలంకౌంటర్ :** నగరంలోని పోతురాజు కాలువను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని వైసీపీ మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 61వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పోతురాజు కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అందులో పేరుకుపోయిన భారీ వ్యర్థాలను చూసి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఒక చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదానికి ఏ విధంగా కారణమవుతుందో చెప్పడానికి ఈ కాలువ దుస్థితే నిదర్శనం. ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా వీధుల్లో పడేయడం వల్లే, అవి వర్షపు నీటితో పాటు కాలువలోకి చేరుతున్నాయి. ఫలితంగా కాలువలు పూర్తిగా పూడిపోయి, నీరు వెళ్లడానికి మార్గం లేక కాలనీల్లోకి మురుగునీరు వచ్చేస్తోంది. మున్సిపల్ అధికారులు ప్రతిరోజూ ఇళ్లకు చెత్త సేకరించే వాహనాలను పంపుతున్నప్పటికీ, కొందరి నిర్లక్ష్యం వల్ల పోతురాజు కాలువలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారీ ఈ కాలువ పొంగిపొర్లడం వల్ల చంద్రయ్య నగర్, బలరాం కాలనీ, నెహ్రూ నగర్, బిలాల్ నగర్ వంటి ఎన్నో లోతట్టు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, దీనివల్ల ఎంతోమంది ప్రజలు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులవుతున్నారని ప్రసాద్ గుర్తుచేశారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఒకచోట సేకరించి, మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే వాటిలో వేయాలని ఆయన నివాసితులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.

## పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ



**కందుకూరు,కలంకౌంటర్ :** చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న పేద వారిని ఆదుకుందాం అనేనినాదంతో, మానవ సేవే మాధవ సేవ అంటూ నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా అడుగులు వేస్తూ శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ(8341221414) కందుకూరు వారి ఆధ్వర్యంలో సోమవారం నలదలపూరు వాస్తవ్యులు కీ.శే. నేలపాటి లక్ష్మీ నరసింహం జ్ఞాపకార్థం వారి శ్రీమతి వెంకట రమణమ్మ, కుమారుడు హరినాథ్ కుటుంబ సభ్యుల సహకారంతో కందుకూరు పట్టణం ఊరి బయట ఉన్న పేదలకు నూతన వస్త్రములు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీరామసాయి బాబావెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు సేవా హృదయ రవ్వా శ్రీనివాసులు (ఎల్. ఐ.సి ఫ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్), గౌరవ అధ్యక్షులు డా "చక్కా వెంకట కేశవరావు, ఎం .కే .శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి అమ్మ అనుగ్రహ సొసైటీ వ్యవస్థాపకులు కొచ్చర్ల మల్లికార్జున స్వామి, కోలా చంద్రశేఖర్(ఏ ఎస్ ఐ ), రాధాకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.










# అర్నాబ్ తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**● 27, 28 తేదీల్లో అత్యవసరమైతేనే బయటకు రావాలి ● కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అర్నాబ్ తుపాను ప్రభావంతో కృష్ణా జిల్లాలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి 28వ తేదీ వరకు భారీ వర్షాలు, గంటకు 115 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ప్రజలు అధికారులకు సహకరించి భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, తుపాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు వీలైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించవద్దని, చెట్ల కింద నిలబడవద్దని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రభావిత ప్రాంతాలు, కచ్చా ఇళ్లలో నివసించే ప్రజల భద్రత కోసం 273 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది ముందస్తుగా తరలివెళ్లాలని సూచించినప్పుడు ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు



చేరుకోవాలని కోరారు. తుపాను సమయంలో పునరావాస కేంద్రాలకు తరలివెళ్లడంలో జాప్యం చేయడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. బలమైన గాలుల కారణంగా చెట్లు కూలి రహదారులకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున వాటిని తక్షణమే తొలగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన చోట్ల వినియోగించేందుకు పవర్ సా యంత్రాలు, జేసీబీలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి సబ్‌స్టేషన్ వద్ద అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, నైపుణ్యం కలిగిన సిబ్బందిని అందుబాటులో ఉంచామని వివరించారు. భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రోడ్లపై వరద నీరు ప్రవహించడం, రహదారులపై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గమనించాలని, నీరు ప్రవహిస్తున్న రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వరద ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ప్రజలకు సూచించారు. ప్రజలు అత్యవసర సమాచారం, సహాయం కోసం కింది నంబర్లను సంప్రదించవచ్చని వెల్లడించారు.

**కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:** – జిల్లా కలెక్టరేట్: 08672-252399 – ఆర్డీవో కార్యాలయం, మచిలీపట్నం: 08672-252486 – ఆర్డీవో కార్యాలయం, ఉయ్యూరు: 08676-232589 – ఆర్డీవో కార్యాలయం, గుడివాడ: 08674-243698

# తుపాను ‘అర్నాబ్’ నేపథ్యంలో దక్షిణ కోస్తా రైల్వే అప్రమత్తం

**విశాఖపట్నం,కలంకౌంటర్ :** తుపాను ‘అర్నాబ్’ కారణంగా భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో దక్షిణ కోస్తా రైల్వే అప్రమత్తమైంది. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది భద్రతతో పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను ముమ్మరం చేసింది. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ రైల్వే జోన్‌లో చేపట్టిన ముందస్తు భద్రతా చర్యలు, విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. నాలుగు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు), ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ (పీహెచ్ఓడీలు)తో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

**రైల్వే ట్రాక్‌లు, వంతెనలపై నిరంతర నిఘా..** తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని రైల్వే వంతెనలు, ట్రాక్‌లు, యార్డులు, సిగ్నలింగ్ వ్యవస్థలపై నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నీరు నిలిచిపోకుండా క్యాచ్ వాటర్ డ్రెయిన్లు, ఇతర మురుగునీటి

## 24 గంటల వార్ రూమ్‌లు ఏర్పాటు

కాలువల్లో పేరుకుపోయిన మట్టి, మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ట్రాక్ పర్యవేక్షకులు, వాచ్‌మెన్‌లను నియమించారు. అత్యవసర పరిస్థితుల్లో ట్రాక్‌ల మరమ్మతులకు అవసరమైన సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచారు.

**ప్రభుత్వ శాఖలతో సమన్వయం..** వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను నిరంతరం పరిశీలిస్తూ, రాష్ట్రప్రభుత్వ అధికారులతో సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని జనరల్ మేనేజర్ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు దక్షిణ కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయంతో పాటు డివిజనల్ ప్రధాన కార్యాలయాల్లో 24 గంటలూ పనిచేసే వార్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

**ప్రయాణికులకు ప్రత్యేక ఏర్పాట్లు..** ప్రయాణికులకు సకాలంలో సమాచారం అందించేందుకు ప్రధాన రైల్వే స్టేషన్లలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ రైళ్లు రద్దయితే టికెట్ రీఫండ్‌ల కోసం అదనపు కౌంటర్లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వే క్యాటరింగ్ యూనిట్లలో తగినంత ఆహార నిల్వలు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లను కూడా సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య బృందాలు, ప్రథమ చికిత్స సదుపాయాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. సివిల్ డిఫెన్స్ సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లను అప్రమత్తం చేశారు. అవసరమైతే ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయాన్ని అందించేందుకు అత్యవసర స్పందన బృందాలను కూడా సిద్ధం చేశారు.







స్థానిక 29వ డివిజన్ లో వైయస్సార్ పార్టీ అభ్యర్థి షేక్ అచ్చెభా ఇంటింటికి వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం లో నిత్యావసర సరుకులు ధరలు నేడు ఉన్న ధరలు బేరీజు వేసుకుని ఓటు ద్వారా అధికార పార్టీకి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

–మచిలీపట్నం,కలంకౌంటర్ :

# ఇంటింటికి కొట్టే ప్రచారం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 10 వ డివిజన్ టిడిపి, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి కొట్టే వెంకట్రావు ఇంటింటికి వెళ్ళి గ్లాస్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఓటర్లు కొట్టే వెంకట్రావు కు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్నారు. డివిజన్ అభివృద్ధికి మీ ఓటు ద్వారా చేయూత ఇవ్వాలని కొట్టే విజ్ఞప్తి చేశారు.

# ఆశీర్వదించండి-అండగా ఉంటాం-పొంగూరు రమాదేవి

**● ప్రచారంలో దూకుడు పెంచిన కూటమి ● రమాదేవి రోడ్‌షోలకు విశేష స్పందన ● 10, 15, 16, 17 డివిజన్లలో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం ● మేయర్‌గా రూప్‌కు లక్షకు పైగా మెజారిటీ ఖాయం: పొంగూరు రమాదేవి**





**నెల్లూరు,కలంకౌంటర్:** నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం నెల్లూరులో ఊపందుకుంది. మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలతో ప్రచార వేగాన్ని పెంచారు. 10, 15, 16, 17 డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృతంగా పర్యటించారు. డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్పొరేటర్లుగా కిన్నెర కోటేశ్వరి, కెజియా కుమారి, కమ్మ కల్యాణి, కాకర్ల తిరుమల నాయుడులను, మేయర్ అభ్యర్థిగా రూప్ కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని రమాదేవి కోరారు. ప్రచారానికి వచ్చిన ఆమెకు స్థానిక మహిళలు మంగళహారతులు పట్టి, పూలవర్షంతో స్వాగతం పలికారు. కూటమి కార్యకర్తల జైజై నినాదాలతో డివిజన్లలో సందడి నెలకొంది. రోడ్‌షోలో టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు రెపరెపలాడాయి.

**ప్రజాస్పందనే విజయానికి సంకేతం..** ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రమాదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, మంత్రి నారాయణ చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ, పేదలకు అండగా నిలిచిన నారాయణకు తమ మద్దతు ఉంటుందని ప్రజలు భరోసా ఇస్తున్నారని చెప్పారు. కూటమి పాలనలో రెండున్నరేళ్లుగా ప్రశాంతంగా జీవిస్తున్నామని ప్రజలు చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న స్పందన కూటమికి అనుకూలంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. 72 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని, మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ లక్షకు పైగా మెజారిటీ సాధిస్తారని రమాదేవి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి, వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

# గెలుపుకు సహకరించాలని లంకిశెట్టికి వినతి

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** 19వ డివిజన్ కూటమి అభ్యర్థిని లంకి శెట్టి నీరజ ప్రచార పర్వంలో లంకి శెట్టి బాలాజీ తో మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ళ కాంతారావు. ఈ సందర్భంగా తన గెలుపుకు సహకరించాలని లంకిశెట్టి బాలాజీ ని కోరిన కార్పొరేటర్ అభ్యర్థి నీరజ.

# పతి కోసం సతి ప్రచారం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 47 వ డివిజన్ వైసీపీ అభ్యర్థి ఎస్ ఎన్ గుప్తా గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసిన అభ్యర్థి సతీమణి రేణుకా రాణి.

# తన భర్తను బలవంతంగా తీసుకెళ్లారంటూ డీఎస్పీకి భారతి ఫిర్యాదు



**కందుకూరు,కలంకౌంటర్ :** తన భర్త జూఇంటూరి హరిబాబును గుడ్లూరు సీఐ బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపిస్తూ వలేటివారిపాలెం మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. బడేవారిపాలెంలోని తమ ఇంటికి తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుడ్లూరు సీఐ మరికొందరితో కలిసి ప్రైవేటు వాహనంలో వచ్చి, తన భర్తను బలవంతంగా తీసుకెళ్లారని భారతి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో విచారించగా తన భర్త అక్కడ లేరని చెప్పారని, ఆయన ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్నానని తెలిపారు. తన భర్తకు రక్షణ కల్పించి, ఆయన ఎక్కడ ఉన్నారో తెలియజేసి ఇంటికి పంపించాలని, సంబంధిత సీఐపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి ఆమె డీఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు.

# మదన్ వైద్యానికి ఆర్థిక సహాయం అందించిన ఎం.కే.శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మ అనుగ్రహ సొసైటీ





**కందుకూరు,కలంకౌంటర్ :** అంద్రా మదన్ అనే కుర్రవాడు ప్రమాదవశాత్తు జారిపడి వెన్నుముక సమస్యతో నడవలేక మంచానికే పరిమితమై ఉన్నాడు. వెన్నుపూస సర్జరీ కోసం దాదాపు పది లక్షల అవుతుందని అంచనా. విజయవాడలో కొన్ని ఆసుపత్రులు తిరిగిన సర్జరీ చేసిన లాభం లేదని చెప్పారు. కానీ చెన్నైలో విజయ హాస్పిటల్ లో మాత్రమే ఆపరేషన్ చేస్తే నడవగలుగుతాడు అని చెప్పారు. వారికి రోజూ డాక్టర్ ఇంటి వద్దకే వచ్చి ఫిజియోథెరపీ చేస్తున్నారు. వారి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అవసరమని తెలియగానే ఈరోజు ఎం కే .శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మ అనుగ్రహ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కొచ్చర్ల మల్లికార్జున స్వామి (వాస్తు సిద్ధాంతి, న్యూమరాలజీ ప్రశ్న జ్యోతిష్యం నిపుణులు) చేతుల మీదుగా రూ 5000/- ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కోలా చంద్రశేఖర్ (ఏఎస్ఐ),డా”చక్కా వెంకట కేశవరావు, శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు,పగడాల రమేష్ పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా వి. అభిషేక్ నియామకం

**● జిల్లా కలెక్టర్ డీకే బాలాజిని మర్యాదపూర్వకంగా కలిసిన సాధారణ పరిశీలకులు**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెండో సాధారణ పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా ఐఏఎస్ అధికారి, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి. అభిషేక్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది. గతంలో కృష్ణా జిల్లా సాధారణ పరిశీలకునిగా నియమితులైన ఐఏఎస్ అధికారి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు నియామక ఉత్తర్వులను పాక్షికంగా సవరిస్తూ, ఆయన స్థానంలో వి. అభిషేక్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యం లో, నూతనంగా నియమితులైన జిల్లా సాధారణ పరిశీలకులు వి. అభిషేక్, మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

# వాసవి అమ్మవారికి సారె సమర్పించిన్న శిద్ధా లక్ష్మీ పద్మావతి





**దర్శి, కలంకౌంటర్ :** దర్శి పట్టణంలో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం నందు పూజ కార్యక్రమం లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ధర్మపత్ని లక్ష్మీ పద్మావతి పాల్గొని అమ్మవారికి సారె సమర్పించి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా సంఘం గౌరవ అధ్యక్షురాలు శిద్ధా లక్ష్మీ పద్మావతి అనంతరం 36 వారాలు వాసవి అమ్మవారి అమృత కలశ పూజ చేసిన సభ్యులకు సారె కార్యక్రమం లో పాల్గొని మహిళలకు సారె ను అందించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య మహిళలకు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.